
# ఇహం-పరం

ప్రతాప రవిశంకర్



పరమశివం లాంటి మనుషులు కొంచెం అరుదుగా వుంటారనుకుంటాను. అతను చిత్రమైన మనిషి. అతడి ఆలోచనా విధానం చాలా డిఫరెంటుగా వుండేది. నాకు వున్న కొద్దిమంది స్నేహితులలో అతను ముఖ్యమైనవాడు.

ఏడాది క్రితం నాకు విజయవాడకు బదిలీ అయ్యింది. ఉద్యోగరీత్యా నేను గుంటూరులో వున్నప్పుడు పరమశివం, మేము ఒకే వీధిలో వుండేవాళ్లం.

బరువెక్కిన హృదయంతో నేను గుంటూరు నించి విజయవాడకు మకాం మార్చాను. ఇందుకు నూటికి నూరుపాళ్లు పరమశివం కారణం. నాకు వీడ్కోలు ఇవ్వడానికి నా స్నేహితులంతా వచ్చారు. ఒక్క పరమశివం తప్ప.

ఎందుకంటే ఈ లోకంలో వుండి వుంటే పరమశివం కూడా తప్పకుండా వచ్చి వుండేవాడే. అప్పటికి మూడు నెలల క్రితం ఈ లోకం నించి వెళ్లిపోయాడు. అందువల్లనే అతడి జ్ఞాపకాలను తట్టుకోలేక అక్కడి నుంచి బదిలీ చేయించుకొని ఆ వూరు విడిచి వెళ్లిపోయాను.

ఊరు మారినా పరమశివం లాంటి ఆత్మీయుడి ఎడబాటు నన్ను బాధిస్తూనే వుంది. పరమశివంతో స్నేహం చేసిన వారెవరూ అంత సులభంగా అతడిని మరిచిపోలేరు.

పరమశివం ఓ ప్రభుత్వ

కార్యాలయంలో పనిచేసేవాడు. అతడికి డబ్బు సంపాదన మీద అంతగా యావ వుండేది కాదు. అందువల్లనే చనిపోయేనాటికి అతను ఒక సొంత ఇంటిని కూడా అమర్చుకోలేకపోయాడు.

అతనికి ఐహిక సుఖాల మీద, భోగాల మీద అంతగా వ్యామోహం వుండేది కాదు. పరలోక జీవితం గురించి ఎక్కువగా ఆలోచిస్తూ వుండేవాడు. ఎక్కువగా అతడు పాప పుణ్యాల గురించీ, ఓ మనిషిగా సాటి మనుషుల పట్ల చూపించవలసిన ప్రేమ, జాలి, కరుణ గురించి అవసరంలో వున్న మనుషులకు చెయ్యవలసిన సాయం గురించీ మాట్లాడుతూ వుండేవాడు. ఎప్పుడూ ఆధ్యాత్మిక పుస్తకాలను చదువుతూ, అందులో వున్న విషయాల గురించి నాలాంటి స్నేహితులకు చెబుతూ వుండేవాడు. ఎప్పుడు కొద్దిపాటి సెలవు దొరికినా రకరకాల దేవాలయాలకీ, తీర్థాలకి వెళుతూ వుండేవాడు. అతడితో కలిసి నేను కొన్నిసార్లు శ్రీశైలానికి, సోమేశ్వరాలయానికి వెళ్లాను. పరమశివానికి ప్రయాణాలు చెయ్యడం మీద ఎక్కువ ఆసక్తి వుండేది. అంత ఆరోగ్యవంతుడు కాకపోయినా ఎన్నో గంటలు ప్రయాణం చేసి రకరకాల కొత్త ప్రదేశాలు చూసేవాడు.

పరమశివంలో వున్న ఈ ప్రయాణం సరదా అతడి పిల్లలకు నచ్చేదికాదు. అతడికి ఇద్దరు పిల్లలు. అతడు చాలా మందిలా ప్రభుత్వ ఉద్యోగం వుండి కూడా దండిగా డబ్బును సంపాదించలేడని, తమ విలాసవంతమైన జీవితానికి సహాయపడలేదనే అసంతృప్తి ప్రకటిస్తూ వుండేవాళ్లు. అయినా పరమశివం తన వైఖరిని మార్చుకునేవాడు కాదు. నాకు తెలిసి అతను తన భార్యాపిల్లలను మితిమీరి ఎప్పుడూ ప్రేమించినట్లు కనపడలేదు. ఒక తండ్రిగా, కుటుంబ యజమానిగా తన పాత్రను సాధారణంగా పోషించేవాడు. పిల్లల గొంతెమ్మ కోరికలు తీర్చడం గురించి, వాళ్ల ఉజ్వలమైన భవిష్యత్తు గురించి ఎప్పుడూ ఎలాంటి ఆరాటాన్ని, తాపత్రయాన్ని కనపరిచేవాడు కాదు. ఏదో నాటకంలో నటిస్తున్న వాడిలా వుండేవాడు.

బయటకు వచ్చినప్పుడు అతడి జేబులో ఒక్క రూపాయి లేకపోయినా ఎంతో డబ్బు వున్న వాడిలా వుండేవాడు. సుఖాల్లో పొంగిపోవడం. కష్టాల్లో కుంగిపోవడం అతడిలో లేదు. ఎప్పుడూ ఒకేలా వుండేవాడు. అలా వుండడం అందరికీ సాధ్యం కాదని నా నమ్మకం.

పరమశివం ఎక్కువగా శ్రీశైలం వెళుతూ వుండేవాడు. అక్కడ అతనికి ప్రశాంతంగా వుంటుందిట. నాకూ అలాగా అనిపించింది. అందుకే రెండురోజులు సెలవులు కలిసి వచ్చాయని నా భార్యతో శ్రీశైలానికి విజయవాడ నుంచి ఉదయమే బయలుదేరాను.

బస్సులో అతను నా పక్కనే కూర్చున్నపుడు అనిపించింది. నా ఆలోచనల నిండా పరమశివమే వున్నాడు. ఆ మాటలనే నా శ్రీమతితో అన్నప్పుడు–

''మంచి మనిషి, ఆ నాగార్జునసాగర్ వెళ్లకుండా వుంటే బతికి వుండేవాడేమో!'' అన్నది.

ఆమె అలా అన్నప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. తన ఆఫీసులో పనిచేసే ఓ ఇద్దరు స్నేహితులతో కలిసి పరమశివం నాగార్జునసాగర్ వెళ్లాడు. అక్కడ నుంచి నాగార్జున కొండకు వెళ్లి మ్యూజియమ్ చూసి తిరిగి లాంచీలో వస్తున్నప్పుడు అతడు అంచు మీద కూర్చున్నందున ప్రమాదవశాత్తు జారి కృష్ణానదిలో పడి మునిగిపోయాడు.. ఎవ్వరూ అతన్ని రక్షించలేకపోయారు.

''పరమశివం చనిపోయి సరిగ్గా రేపటికి సంవత్సరం అవుతుంది. కార్తీక బహుళ పాడ్యమి. నాకు బాగా గుర్తు'' అన్నాను. అలా అంటున్నప్పుడు నాగొంతు జీరబోయి ఏడుపు వచ్చింది. కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకుంటున్నప్పుడు–

''బాధపడకండి... ఆయనకు అక్కడ రాసిపెట్టి వుంది'' అన్నది శ్రీమతి.

ఏమయితేనేం? ఒక మంచి స్నేహితుడు నాకు దూరమైనాడు. బస్సు గుంటూరు బస్టాండులో ఆగుతున్నప్పుడు రెండు వక్కపొడి పొట్లాలు తీసుకురమ్మని చెప్పింది నా భార్య. ఆమెకు బస్సు ప్రయాణం పడదు. బస్సులో వున్నంత సేపూ వక్కపొడి నములుతూ వుండాలి. డీజిలు వాసనకు వక్కపొడి విరుగుడు.

అందుకే బస్సు ఆగడంతో కిందికి దిగాను. పాన్‌షాపుదగ్గరకు వెళుతున్నప్పుడు చిన్న సంచీ పట్టుకొని పరమశివం రెండో కొడుకు కనిపించాడు. నేనే అతన్ని పలకరించి–

''రేపు పరమశివం చనిపోయిన రోజు కదా... తద్దినం ఎక్కడ పెడుతున్నారు? ఇక్కడేనా? మీ అన్నయ్య ఇంట్లోనా'' అని అడిగాను.

అతడు కొద్దిగా తడబడి తద్దినం గురించి ఇంకా నిర్ణయించుకోలేదు. అన్నాడు.

వక్కపొడి పొట్లాలు కొని మళ్లీ వచ్చి బస్సు ఎక్కాను.

శ్రీశైలం చేరేవరకూ పరమశివం ఆలోచనలు, అతడితో నా స్నేహం... మేమిద్దరం కలిసి తిరిగిన ప్రదేశాలు నాకు గుర్తుకువస్తూనే వున్నాయి. అతడి స్నేహం నాలో చెరగని ముద్ర వేసింది. పరమశివం స్నేహానికి మారుపేరు.

బస్సు దిగి వెళ్లి అక్కడిసత్రంలో ఓ గది అద్దెకు తీసుకొని లగేజీ అందులో వుంచి దర్శనానికి వెళ్లాము. అక్కడ పరమశివం ఆత్మకు శాంతిని ప్రసాదించమని, అతడికి ఉత్తమ గతులు చేకూర్చమని, తిరిగి మంచి జన్మను ప్రసాదించమని దేవుడిని ప్రార్థించాను.

ఆ రాత్రికి ఆ సత్రంలో పంక్తి భోజనాలు చేశాము. కొండ మీద షాపింగుకు వెళ్లినప్పుడే నా భార్య నాలుగయిదు భక్తి పాటల కేసెట్లు కొన్నది.

తెల్లవారి మళ్లీ ఓ సారి దైవదర్శనం చేసుకొని ఓ జీపు మాట్లాడుకుని, ఆ చుట్టుపక్కల దర్శించదగిన ప్రదేశాలు చూసి వచ్చాము. మేము తిరిగి వచ్చిన గంటసేపటికి భోజన ప్రారంభాన్ని తెలియజేస్తూ సూచనగా గంట మోగింది. వెంటనే భోజనశాలకి వెళ్లాము. భోజనశాలలో గోడకు మధ్యలో ఓ నల్లగా వున్న బోర్డు వున్నది. దాని మీద చాక్‌పీస్‌తో పరమశివం పేరు రాసివుంది.

**బస్సు దిగి వెళ్లి అక్కడిసత్రంలో ఓ గది అద్దెకు తీసుకొని లగేజీ అందులో వుంచి దర్శనానికి వెళ్లాము. అక్కడ పరమశివం ఆత్మకు శాంతిని ప్రసాదించమని, అతడికి ఉత్తమ గతులు చేకూర్చమని, తిరిగి మంచి జన్మను ప్రసాదించమని దేవుడిని ప్రార్థించాను.**

ఆశ్చర్యంతో బోర్డు దగ్గరకు వెళ్లి చదివాను.

–పరమశివం, కార్తీక బహుళ పాడ్యమి– అని రాసి వుంది.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఈ ఏర్పాటు చేసింది ఎవరు? సాధారణంగా తద్దినాలు పెట్టడానికి అవకాశం లేనివాళ్లు ఆలాంటి ఏర్పాటు చేస్తూ వుంటారు.

ఎవరయినా ఆ సత్రానికి ఒక చనిపోయిన మనిషి పేరుతో కొంత విరాళం ఇచ్చినప్పుడు ఆ చనిపోయిన మనిషి పోయిన తిథి రోజున ఆ మనిషి పేరుతో కొంత మందికి అన్నదానం చేస్తారు. ఇప్పుడు పరమశివం పేరుతో చేస్తున్నట్లు...

పరమశివం ఇద్దరు కొడుకుల్లో ఆ ఏర్పాటు చేసింది ఎవరు? తెలుసుకోవాలనుకుని భోజనానంతరం నా శ్రీమతితో కలిసి ఆ సత్రం కార్యాలయానికి వెళ్లాను. అక్కడి గుమాస్తాను ఈ విషయం గురించి అడిగినప్పుడు–

''అలా కూర్చోండి...రశీదు పుస్తకం చూసి చెబుతాను.'' అన్నాడు.

అతడి ఎదురుగా వున్న కుర్చీల్లో కూర్చున్నాం.

ఓ పదినిమిషాలకు అతడు రశీదు పుస్తకం చూసి ఆ రశీదును నాకు చూపించాడు. ఆ సంతకాన్ని గుర్తుపట్టి షాకయ్యాను. అది పరమశివం సంతకం. అంటే పరమశివం ముందుగానే తనకు తానే ఈ ఏర్పాటు చేసుకున్నాడా?

అలాగే అనుకున్నా అతనికి తను తప్పకుండా కార్తీక బహుళ పాడ్యమి తిథి రోజునే చనిపోతానని ఎలా తెలుసు? అతను చనిపోవడానికి మూడునెలలు ముందుగా ఆ రశీదు మీద తేదీ వుంది. అంటే తను ఎప్పుడు చనిపోతాడో పరమశివానికి ముందుగానే తెలుసు.

మళ్లీ షాక్!

అంతా అనుకున్నట్టుగా పరమశివం ప్రమాదవశాత్తు చనిపోలేదు. కావాలనే చనిపోయాడు.

ప్రమాదవశాత్తు చనిపోయినట్లు అందరినీ నమ్మించాడు. చివరకు చనిపోయేటప్పుడు కూడా అతను గుట్టుగానే వున్నాడు. తన మనసులో వున్న ఆలోచనను ఎవరూ పసిగట్టకుండా జాగ్రత్తపడ్డాడు. ఈ ఊహ నాలో కలగగానే నా ఎదురుగా కొంత మంది మనుషులున్నారనే విషయాన్ని కూడా మరిచి అప్రయత్నంగా పెద్దగా కేకపెట్టి ఏడ్చాను.

పరమశివం నిజంగానే అరుదైన మనిషి. ★